సాక్షి
పెద్దపల్లి

బుధవారం, 9, అక్టోబర్, 2024



చీకురాయిలో 'దసరా' డైరెక్టర్

దసరా సినిమా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన స్వగ్రామం చీకురాయిలో మంగళవారం సందడి చేశారు. తొలుత దుర్గాదేవి సన్నిధిలో కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత స్నేహితులు, గ్రామస్తులతో కలిసి ఫొటోలు దిగారు. చిన్ననాటి మిత్రులతో కలిసి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆయనను చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చారు.
– పెద్దపల్లిరూరల్/సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





దుబాయ్ బతుకమ్మ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మహిళలు దుబాయ్ అల్‌హాలీ స్పోర్ట్స్ క్లబ్‌లో ఆది, సోమవారాల్లో బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. ఎమిరేట్స్ తెలంగాణ అసోసియేషన్ నేతృత్వంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ, దాండియా, కోలాటం ఆడారు.



ఎన్టీపీసీలో దీపారాధన

జ్యోతినగర్(రామగుండం): నవ్రాశాలపల్లెలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. మేడిపల్లి సెంటర్‌లో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి



రికార్డులు తనిఖీ చేస్తున్న శ్యాంప్రసాద్

జూలపల్లి(పెద్దపల్లి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి సమస్యలు, విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల జారీ, ప్రజావాణి విన్నపాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహశీల్దారు స్వర్ణ, సిబ్బంది ఉన్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పనుల్లో వేగం పెంచండి



ఇళ్లు పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తదితరులు

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మూడో డివిజన్ జంగాలపల్లిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రగతిని అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి మంగళవారం పరిశీలించారు. నగరంలో 670 ఇళ్ల నిర్మాణం చేపట్టగా, ఇప్పటివరకు 570 పూర్తయ్యాయని, మరో 56 ప్లాస్టరింగ్ దశలో ఉన్నాయని, 34ఇళ్ల నిర్మాణం వివిధ స్థాయిల్లో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. చివరి దశలోని ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని సూచించారు.

మేకపోతు మాంసం కేజీ రూ.800



మాట్లాడుతున్న మటన్ వ్యాపారులు

గోదావరిఖని: రామగుండం నగరంలో మేకపోతు మటన్ ఇకనుంచి కిలో రూ.800 చొప్పున విక్రయించేందుకు నిర్ణయించినట్లు మటన్ వ్యాపారులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెరిగిన ధరల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మేక మటన్ కేజీ రూ.700 చొప్పున విక్రయిస్తున్నామని, పారిశ్రామిక ప్రాంతవాసులు తమకు సహకరించాలని కోరారు. వ్యాపారుల మధ్య పోటీతో గతంలో కేజీ రూ.550 – రూ.650 వరకు విక్రయించడంతో నష్టాలు వచ్చాయని వారు అన్నారు. సమావేశంలో మటన్ వ్యాపార సంఘం నాయకులు జక్కుల తిరుపతి, రాము, గాదె తిరుపతి, అమ్మగో పాల్, జక్కుల దేవేందర్, మేరుగు రాములు, చందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

మంథని: ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సమస్యలు పరిష్కరిస్తామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జమ్మికుంట – బోర్లగూడెం మార్గంలో పాత సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కొత్త సర్వీసులు నడిపిస్తామని డిపో మేనేజర్ పేర్కొన్నారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత కరీంనగర్ నుంచి మంథనికి బస్సు సౌకర్యం కల్పించాలని మరికొందరు విన్నవించారు. మంథని – తాడిచర్ల రూట్లలో అదనంగా బస్సులు నడిపించాలని ఇంకొందరు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖని: శాంతిభద్రతలు, సమాజ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల ఫ్లాగ్‌డే సందర్భంగా నిర్వహించే ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు, యువత, ఫొటోగ్రాఫర్లు అర్హులన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో ఆసక్తి గలవారు ముందుకు రావాలన్నారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో చూపిన ప్రతిభ తెలిపేలా తీసిన 3 ఫొటోలు, మూడు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్స్‌ను పెన్‌డ్రైవ్‌లో ఈనెల 20వ తేదీలోగా సీపీ కార్యాలయంలోని ఎస్‌బీ సీఐ ఆఫీసు లేదా పోలీస్ పీఆర్‌వోకు అందజేయాలని సూచించారు. వివరాల కోసం 87126 56596, 87126 56587 నంబర్లలో సంప్రదించాలని సీపీ కోరారు.

సన్నాలకు సెపరేటు

- ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం కసరత్తు
- సన్నరకం వడ్ల సేకరణకు ప్రత్యేక కౌంటర్లు
- దిగుబడి అంచనా 4.85లక్షల మెట్రిక్ టన్నులు
- జిల్లా వ్యాప్తంగా 336 కొనుగోలు కేంద్రాలు
- నేడు కలెక్టరేట్‌లో అవగాహన సమావేశం



సాక్షి, పెద్దపల్లి: సన్నరకం ధాన్యం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఈ సీజన్ నుంచే దీనిని అమలు చేయనుంది. దీంతో సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ప్రధానంగా సన్నరకం ధాన్యం అధికంగా వచ్చే 42 కేంద్రాలను గుర్తించి అక్కడ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల రెండోవారం నుంచే కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ రకం ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉంటే సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ కలిపి రూ.2,820 ధరతో కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం గుర్తించిన మొత్తం 32 రకాల సన్న వడ్లకు బోనస్ చెల్లిస్తారు.

సన్నరకం వడ్ల గుర్తింపు ఇలా..

సన్న రకం ధాన్యానికి బోనస్ వర్తించనుండడంతో నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు గోల్‌మాల్ చేయకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. సన్నాలను గుర్తించేందుకు, నాణ్యత పరిశీలించేందుకు డిజిటల్ డయల్ క్యాలిఫర్స్‌ను పంపిణీ చేయనున్నారు. వీటి ఆధారంగా ధాన్యం పొట్టు తీసి పొడవు, వెడల్పు, నిష్పత్తి లెక్కిస్తారు. గింజపొడవు 6 మి.మీ. కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 2 మి.మీ. కన్నా ఎక్కువ ఉండవద్దనే నిబంధన ఉంది. ఇలాంటి వాటినే సన్నరకం ధాన్యంగా గుర్తిస్తారు. అలాగే వడ్లను రైస్‌మిల్లుకు తరలించే సమయంలో బస్తాలపై సన్నాలు అయితే 'ఎస్' అని, దొడ్డురకం అయితే 'డీ' అని గుర్తులు ముద్రిస్తారు.

వానాకాలం సాగు వివరాలు

వరి సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)	2,06,500
సన్నరకం(ఎకరాల్లో)	1,72,879
దిగుబడి అంచనా(ల.మె.ట.)	4.85
సన్నరకం దిగుబడి(ల.మె.ట.)	3.57
దొడ్డు రకం దిగుబడి(ల.మె.ట.)	91,654
కొనుగోలు కేంద్రాలు	336

(నోట్ : ల.మె.ట = లక్ష మెట్రిక్ టన్నులు)

సన్నరకం సాగే అధికం..

ఈ వానాకాలంలో రైతులు అత్యధికంగా సన్నరకం వడ్ల సాగుకే ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాలో 2,06,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. మంథని, ముత్తారం, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో సన్నరకం అధికంగా సాగైంది. జూలపల్లి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, అంతర్గాం మండలాల్లో దొడ్డురకం అధికంగా పండించారు. కొనుగోలు కేంద్రాల్లో 1.25 కోట్ల వరకు గన్నీ బ్యాగుల అవసరం ఉంది. ఇప్పటి వరకు 5లక్షల గన్నీ పంచులే చేరుకున్నాయి. వీటిని 336 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తొలుత 10వేల చొప్పున పంపిణీ చేస్తారు. ఈనెల 21న కొనుగోళ్లు ప్రారంభిస్తారు. కొనుగోళ్ల తీరుపై కలెక్టరేట్‌లో బుధవారం అవగాహన కల్పిస్తారు. డిజిటల్ డయల్ క్యాలిఫర్స్ వినియోగంపై శిక్షణ ఇస్తారు.

గతానుభవాలను దృష్టిలో పెట్టుకుంటే మేలు

- ధాన్యం విక్రయించిన తర్వాత 48 గంటల్లోగా రైతు బ్యాంకు ఖాతాలో డబ్బు జమకావాలి. కానీ గతంలో 20రోజులకు పైగానే పట్టింది.
- ట్యాబ్‌లో కొనుగోలు వివరాల నమోదు ఆలస్యం కావడంతో రైతులకు సకాలంలో డబ్బు అందలేదు. మిల్లుల నుంచి పత్రాలు అందిన వెంటనే నమోదు చేయాలి
- డిమాండ్‌కు సరిపడా ధాన్యం శుభ్రం చేసే, తేమశాతం గుర్తించే యంత్రాలను అందుబాటులో ఉంచాలి
- గతంలో గన్నీబ్యాగుల కొరత, లారీల కేటాయింపులో ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సజావుగా కొనుగోళ్లు



వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తారు. ఈక్రమంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికంగా సన్నవడ్లు తీసుకొచ్చే కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. దీనిపై వ్యవసాయ, మార్కెట్ కమిటీలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నాం.

–శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్

యంత్ర పరికరాలు ఉన్నాయ్..

పెద్దపల్లిరూరల్: పేషెంట్లకు రక్త సంబంధ సమస్యలు, పరీక్షల్లో వినియోగించే ప్లేట్‌లెట్, ప్లాస్మా యంత్రాలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఉన్నాయి. ఇవి సుమారు ఐదేళ్ల క్రితమే ఇక్కడకు చేరాయి. కానీ, వాటిని వినియోగించడం లేదు. పేషెంట్లకు ఇంకా ఎన్నాళ్లకు సేవలు అందిస్తాయని జిల్లావాసులు ప్రశ్నిస్తున్నారు.





బ్లడ్‌బ్యాంకులో నిరుపయోగంగా ప్లేట్‌లెట్, ప్లాస్మా యంత్రాలు

- వినియోగమే లేదు
- మూలనపడ్డ ప్లేట్‌లెట్, ప్లాస్మా యంత్ర పరికరాలు
- రూ.1.50కోట్లు వెచ్చించినా నిరుపయోగమే..
- ప్రైవేట్ ల్యాబ్‌ల ను ఆశ్రయిస్తున్న పేదకుటుంబాలు
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి
- బ్లడ్‌బ్యాంక్‌లో దుస్థితి
- కలెక్టర్ చొరవ చూపాలని పేషెంట్ల విన్నపం

జిల్లా ప్రజలను విషజ్వరాలు, ఇతర ప్రాణాంతక వ్యాధులు ఇటీవల వణికించాయి. కాళ్లు, కీళ్ల నొప్పులు ఇంకా నయమే కావడం లేదు. ఇలాంటి వ్యాధులతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి ప్లాస్మా పరీక్షలు అవసరమైతే బయట ఉన్న ప్రైవేట్ ల్యాబొరేటరీలకు ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది. ఇదే ఆస్పత్రి ఆవరణలో సంబంధిత యంత్రాలు అందుబాటులో ఉన్నా.. వినియోగంలోకి రాకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి.

కలెక్టర్ చొరవ చూపితేనే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవ చూపుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రితోపాటు వివిధ గ్రామాలు, పట్టణాలు, నగరాల్లోని ఆస్పత్రులను సైతం కలెక్టర్ తరచూ సందర్శిస్తున్నారు. పేదలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీస్తున్నారు. పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచిస్తున్నారు. కలెక్టర్ చొరవతో పలు రకాల ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

అందుబాటులోకి టిఫా స్కానింగ్..

ప్రసూతి కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు టిఫా లాంటి స్కానింగ్ సేవలను కలెక్టర్ కోయ శ్రీహర్ష ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే చిన్నారుల వైద్యం కోసం ప్రత్యేక విభాగం ప్రారంభించారు. అదేతీరున ఐదేళ్ల నుంచి జిల్లా కేంద్రమైన పెద్దపల్లితోపాటు గోదావరిఖని, మంథని ఆస్పత్రుల్లో మూలన పడిఉంటున్న దాదాపు రూ.1.50కోట్ల విలువైన ప్లేట్‌లెట్, ప్లాస్మా యంత్రాలను వీలైనంత త్వరగా పేషెంట్లకు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదించాం



ప్లేట్‌లెట్, ప్లాస్మా యంత్రాలను బిగించడం కోసం అదనపు గదులు అవసరం. వాటిని నిర్వహించేందుకు సిబ్బందిని కూడా నియమించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఆ పనులు పూర్తయితేనే యంత్రాలు వినియోగంలోకి వస్తాయి.

– శ్రీధర్, ఆస్పత్రి సూపరింటెండెంట్

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: గ్రామాలు సుస్థిర అభివృద్ధి సాధించేలా గ్రామ పంచాయతీ ఆదాయ, వ్యయాల రికార్డులను సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలను ప్రజలకు వివరించి ఆమోదింపజేసుకోవాలని ఆదేశించారు. ఆ వివరాలను పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డీపీవో వీరబుచ్చయ్య, ఈటీసీ ప్రిన్సిపాల్ విజయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువుపై ప్రచారం

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జాబితాలో ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6వ తేదీ వరకు గడువు ఉందని, ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు హాజరయ్యారు. గతంలో ఓటరుగా నమోదైనవారు సైతం మళ్లీ ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించాలని, డిసెంబర్ 2లోపు అభ్యంతరాలు పరిష్కరించి 30న తుది ఓటరు జాబితా ప్రచురించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు గంగయ్య, హనుమా నాయక్ పాల్గొన్నారు.

భూ కేటాయింపులు పూర్తిచేయండి

మంథని: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు అవసరమైన భూ కేటాయింపులు పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అభివృద్ధి పనులకు భూ కేటాయింపులపై కలెక్టర్ అరుణశ్రీతో కలిసి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి మూడెకరాలు, తహసీల్దార్, ఆర్డీవో, ఆర్ అండ్ బీ భవన నిర్మాణాలకు 2.21 ఎకరాలు, కళాభారతి నిర్మాణానికి 8 గుంటలు, కమ్యూనిటీ హాల్, ఆర్‌బీ అండ్ బీ అతిథి గృహం నిర్మాణానికి ఎకరం, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి 30 గుంటలు, అడవిసోమన్‌పల్లిలో సమీకృత గురుకులాల భవన నిర్మాణానికి 25 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించి సంబంధిత శాఖలకు బదలాయించాలని కలెక్టర్ ఆదేశించారు. దేవాదాయ శాఖ పరిధిలో అనుకూలమైన భూములు ఉంటే వాటికి ప్రస్తుతం మార్కెట్ విలువను ఆ ఆలయానికి చెల్లించి అభివృద్ధి పనులకు కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమా నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు పూర్తి

కోల్‌సిటీ(రామగుండం): నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, అడిషనల్ కలెక్టర్, ఎఫ్‌ఏసీ మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ, అధికారులతో కలిసి అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ శివానంద్, సెక్రటరీ రాజు, ఈఈ రామన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తాం

- అధికారులను నేరుగా సంప్రదించండి
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: సంక్షేమ పథకాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి అర్హులకు ప్రయోజనం కలుగకుంటే నేరుగా అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం అంతర్గాంలో ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. 102 మందికి రూ.1,02,11,832 విలువైన చెక్కులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దుర్గం విజయ, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, ప్రతినిధులు సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, సంగనవేణి శేఖర్, తహసీల్దార్ ఉయ్యాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చండీహోమంలో..

గోదావరిఖనిటౌన్: స్థానిక 11వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చండీహోమంలో పాల్గొన్నారు.

గనిపై ప్రత్యేక పూజలు..

గోదావరిఖని: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిపై అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, జీఎం లలిత్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గని అధికారులు, నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

రామగుండం: దక్షిణ మధ్య రైల్వేలోని కాజీపేట – బల్హార్షా సెక్షన్ల మధ్య ప్యాసింజర్ రైళ్లను యథావిధిగా నడిపించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కోరారు. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ నాగ్యాను మంగళవారం వారు కలిశారు. పలు సమస్యలపై ఒక వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. కోవిడ్‌కు ముందు నడిపినట్లు అన్ని ప్యాసింజర్ రైళ్లను యథావిధిగా నడిపించాలని వారు కోరారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, ఓదెల, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి తదితర రైల్వేస్టేషన్లలో రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని అన్నారు. రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని విన్నవించారు. పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాలలో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): ప్రతిభగల క్రీడాకారులకు ఆర్థికంగా అండగా ఉంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభయం ఇచ్చారు. నందిమేడారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలను మంగళవారం విప్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ప్రతిభ ఉండి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సమస్యలు ఎదురవుతున్న వారు తనను నేరుగా సంప్రదిస్తే ఆర్థిక సాయం చేస్తానన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. క్రీడా రంగంలో రాజకీయ జోక్యం ఉండ రాదన్నారు. రాజకీయాలకతీతంగా పోటీలు నిర్వహించాలని సూచించారు. క్రీడాకారులు ప్రతిభ కనపర్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, బ్లాక్ –2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, నాయకులు తిరుపతిగౌడ్, కమలేశ్, మందపెల్లి మల్లేశం, చిప్ప మణికుమార్, కట్ట స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే 'మాలెం' ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారం, రూ.50 వేలు అపహరణ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గోదావరిఖని(రామగుండం): మాజీ ఎమ్మెల్యే, దివంగత మాలెం మల్లేశం ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. ఆయన కుమారుడు కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్ సోమవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. మంగళవారం తెల్లవారుజామున కిరణ్ ఇంటికి రాగా, తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, పరిశీలించాడు. బీరువాలోని 12 తులాల బంగారం, రూ.50 వేలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాలు, వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ రెండో సీఐ రవీందర్ తెలిపారు.

జేఎన్టీయూలో ఆయుధపూజ


కిరీటం అలంకరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

రామగిరి(మంథని): సెంటనరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో మంగళవారం దుర్గాదేవీ అమ్మవారి సన్నిధిలో ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ మాత విగ్రహానికి ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి వెండి కిరీటం అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. డీఈఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు క్రీడాదుస్తులు ఏవి?

- ఏడునెలలు గడుస్తున్నా అందని క్రీడాదుస్తులు
- సాధారణ దుస్తుల్లోనే సింగరేణి స్థాయి పోటీలకు..
- పట్టించుకోని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఏటా రూ.వేల కోట్ల లాభాలు ఆర్జిస్తోంది.. కానీ, క్రీడాకారులు, క్రీడా పోటీలపై పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు ఎదుర్కొంటోంది. ఇందుకు నిదర్శనమే సింగరేణి తరఫున వివిధ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఇప్పటివరకు కనీసం దుస్తులు కూడా అందించడం లేదు.


సివిల్ దుస్తుల్లో సింగరేణి క్రీడాకారులు(ఫైల్)

గోదావరిఖని: క్రీడాకారుల విషయంలో సింగరేణి యాజమాన్యం చిన్నచూపు చూస్తోందని కార్మికులు వాపోతున్నారు. కార్మికులు, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న యాజమాన్యం క్రీడాకారుల విషయంలో పట్టించుకోవడం లేదని అంటున్నారు. సింగరేణి విస్తరించి ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని 11 ఏరియాల్లో ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. వీరికి తర్ఫీదు ఇవ్వడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం కూడా చేస్తోంది. ఇందుకోసం రూ.1.20 కోట్లను యాజమాన్యం కేటాయిస్తూ వస్తోంది. ఈ నిధులను క్రీడాదుస్తులు, షూలు, క్రీడాపరికరాలు, కోలిండియా పోటీలకు వెళ్లి వచ్చే వారికి రవాణా, ఇతర ఖర్చుల నిమిత్తం వినియోగిస్తోంది.

11 ఏరియాల్లో 1,650మంది క్రీడాకారులు..

సింగరేణిలోని 11 ఏరియాల నుంచి సుమారు 1,650 మంది కార్మికులు క్రీడాపోటీల్లో పాల్గొంటున్నారు. ఏటా ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరిలో క్రీడలకు అవసరమైన బడ్జెట్‌ను యాజమాన్యం విడుదల చేస్తోంది. ఈక్రమంలోనే 2023–24 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన క్రీడా బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంది. సుమారు ఏడు నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాలేదు. దీంతో క్రీడాకారులకు డ్రెస్ మెటీరియల్, క్రీడా మెటీరియల్ కొనుగోలులో జాప్యం ఏర్పడింది. అయితే 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డ్రెస్ మెటీరియల్, స్పోర్ట్స్ మెటీరియల్ ఆలస్యంగా ఈఏడాది ఫిబ్రవరిలో విడుదల చేసినట్లు కార్మికులు తెలిపారు. ఈఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మెటీరియల్ ఇప్పటివరకు రాలేదని పేర్కొంటున్నారు. దీంతో సివిల్ దుస్తులు, తమ సొంతంగా కొనుగోలు చేసిన షూష్‌తో క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు.

ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు ఇవే..

సంస్థలో రెండు రకాల పోటీలను యాజమాన్యం నిర్వహిస్తోంది. ఇండోర్‌లో షెటిల్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారం, బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఏరియా నుంచి కోలిండియా స్థాయిలో నిర్వహిస్తారు. అలాగే అవుట్‌డోర్‌లో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, లాన్‌టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తోంది. వీటిలో సింగరేణిస్థాయిలో ఒక్కో ఏరియాకు ఒక్కో గేమ్‌ను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తోంది.

పోటీల తీరు ఇలా..

ఏటా ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే డిపార్ట్‌మెంటల్, ఏరియా, రీజియన్, సింగరేణి స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. సింగరేణి స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను కోలిండియా స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడి పోటీలకు సంస్థ ఖర్చులతో క్రీడాకారులను పంపిస్తారు. ఇలా ఒక్కో ఏరియా నుంచి 150మంది క్రీడాకారులు, సంస్థవ్యాప్తంగా 1,650మంది ఉద్యోగులు పోటీల్లో పాల్గొంటున్నారు.

బల్దియాలో సంబురం


బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే, మేయర్, అడిషనల్ కలెక్టర్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. మేయర్ బంగి అనిల్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఆకట్టుకునేలా బతుకమ్మలను పేర్చిన స్వశక్తి మహిళలకు బహుమతులు అందజేశారు. మాజీ మేయర్ జాలి రాజమణి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, కొలిపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

పని ఆశచూపి.. కత్తితో దాడిచేసి

- వృద్ధురాలి నుంచి ఆభరణాలు చోరీ


బాధితురాలు నిర్మల

జ్యోతినగర్(రామగుండం): ఇంట్లో ఉన్న వృద్ధురాలుకి పని కల్పిస్తానని నమ్మబలికిన అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ.. రోజంతా వివిధ ప్రాంతాల్లో తిప్పింది. రాత్రి సమయంలో ఆమెపై కత్తితో దాడి చేసింది. తీవ్రంగా గాయపరిచి ఆభరణాలు దోచుకెళ్లింది. ఈ ఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. రామగుండం కార్పొరేషన్ రెండోడివిజన్ న్యూపీకే రామయ్యకాలనీలో నివాసం ఉంటున్న నిర్మల మండల్(60)ని అదే ప్రాంతానికి చెందిన అశ్విని తాండి పనికల్పిస్తానని చెప్పి సోమవారం ఉదయం గోదావరిఖనికి తీసుకెళ్లింది. రోజంతా ఆమెను వివిధ ప్రాంతాల్లో తిప్పింది. సాయంత్రం సమయానికి ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు తీసుకొచ్చింది. ఈ తర్వాత ఇంటికి వెళ్దామని చెప్పి అన్నపూర్ణకాలనీ మీదుగా గుట్ట ప్రాంతంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లింది. అప్పటికే చీకటి కావడంతో వృద్ధురాలి నోటిలో గుడ్డలు పెట్టి అరవకుండా చేసి కత్తితో దాడి చేసింది. చెవుల నుంచి బంగారు ఆభరణాలు లాగింది. దీంతో చెవులకు గాయాలయ్యాయి. ఆ తర్వాత ఆమె మెడ, చేతిపై బలమైన గాయాలు చేసింది. నిర్మల అపస్మారక స్థితికి చేరడంతో నిందితురాలు రెండు తులాల బంగారు చెవికమ్మలు, 15 తులాల వెండి కడియాలను పట్టుకుని అక్కడినుండి పరారైంది. మంగళవారం ఉదయం నిర్మలకు మెళకువ రాగా న్యూపీకే రామయ్యకాలనీకి గాయాలతో చేరుకుంది. స్థానికులు వెంటనే ఆమెను గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించి పోలీసులకు సమాచారం అందించారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సతీశ్ ఆస్పత్రికి చేరుకున్నారు. దాడి విషయాన్ని వృద్ధురాలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్యాప్తు చేపట్టారు.

జడ్జి సమక్షంలో వాగ్మూలం..

దాడి ఘటనలో తీవ్ర గాయాలపాలైన నిర్మల మండల్ కుటుంబసభ్యులు అందుబాటులో లేరు. దీంతో ఆమె ఇచ్చిన వివరాలను గోదావరిఖని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మంజులతో వాగ్మూలాన్ని నమోదు చేశారు. న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన పసుల ప్రకాశ్‌తో ఫిర్యాదును స్వీకరించారు.

కార్మిక కుటుంబాల ఇంట ప్రభుత్వ కొలువులు

ముస్తాబాద్(సిరిసిల్ల): డీఎస్సీలో ముస్తాబాద్ మండలానికి చెందిన అభ్యర్థులు సత్తాచాటారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందుకోనున్న అభ్యర్థుల నేపథ్యం ఇదీ..

బీడీ కార్మిక కుటుంబం నుంచి..


కొంక రాము

ముస్తాబాద్‌కు చెందిన కొంక రాజు, జ్యోతి దంపతుల లిద్దరూ బీడీ కార్మికులే. వీరి పెద్ద కుమారుడు కొంక రాము ఎస్జీటీ పోస్టులో జిల్లాలో 23 ర్యాంకు సాధించాడు. బీడీ కార్మిక కుటుంబం నుంచి వచ్చిన రాము ఒకవైపు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ సొంతంగా ప్రిపేర్ అయ్యాడు.

కార్మికురాలి ఇంటా ఉపాధ్యాయురాలు


విద్యారాణి

గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన చింతల విద్యారాణి ఎస్జీటీ పోస్టు సాధించింది. తండ్రి శ్రీనివాస్ బీడీ కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లి బీడీ కార్మికురాలు. ఇంటర్ వరకు గంభీరావుపేటలో చదివిన విద్యారాణి, డీఎడ్ వరంగల్‌లో చేసింది. పేద కుటుంబానికి చెందిన ఆమె డీఎస్సీలో 33వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైంది.

ఏకైక పీడీ పోస్టు సాధించిన చామంతి


చామంతి

తెర్లుమద్దికి చెందిన చామంతి జిల్లాలో ఉన్న ఫిజికల్ డైరెక్టర్(పీడీ) పోస్టు సాధించి సత్తాచాటింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న ఏకైక పీడీ పోస్టుకు 134 మంది పోటీపడ్డారు. చామంతి 56.5 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈమె భర్త మహేశ్ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. వీరికి ఒక పాప ఉండగా, భర్త ప్రోత్సాహంతోనే తాను పీడీ పోస్టు సాధించానని చామంతి ఆనందం వ్యక్తం చేసింది.

తండ్రి కల నెరవేర్చిన తనయులు


గంగయ్య


జనార్దన్

వీర్నపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడాలన్న తండ్రి కలను సాకారం చేశారు తనయులు. కానీ ఆ సంతోషాన్ని చూడకుండానే నాన్న మృతి చెందడాన్ని గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం ఉమ్మడి మద్దిమల్లలోని బంజేరు గ్రామానికి చెందిన కన్నం మల్లయ్య- మణేవ్వ దంపతుల కుమారులు గంగయ్య, జనార్దన్ ఎస్జీటీలు ఉద్యోగం సాధించారు. ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నప్పుడు తండ్రి హఠాన్మరణం చెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. తండ్రి మరణం దిగమింగుతూ మరోపక్క డీఎస్సీ–2008కి ప్రిపేర్ అయ్యారు. అప్పుడు గంగయ్య ఉద్యోగానికి ఎంపిక కాగా, జనార్దన్ అరమార్కుతో ఉద్యోగం కోల్పోయాడు. మళ్లీ ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. కానీ తన తండ్రి కలను సాకారం చేయాలని జనార్దన్ పట్టుదలతో శ్రమించి డీఎస్సీ–2024లో ఎస్జీటీగా ఎంపికయ్యాడు.

ఏడాదిలో మూడు ఉద్యోగాలకు ఎంపిక


కిరణ్‌కుమార్

సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన మొలుగూరి కిరణ్‌కుమార్ ఏడాదిలో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇతనిది నిరుపేద కుటుంబం. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుతూ.. పోటీ పరీక్షలు రాశాడు. ఈ ఏడాది జులైలో టీఆర్ఈఐఆర్‌బీ ప్రకటించిన గురుకుల ఉపాధ్యాయ నియామక ఫలితాల్లో జోన్-3లో రెండో ర్యాంక్‌తో సోషల్ టీజీటీగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం వీణవంక గురుకులంలో ఉద్యోగం చేస్తున్నాడు. సెప్టెంబర్‌లో టీజీపీఎస్సీ ప్రకటించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో స్టేట్ 357 ర్యాంక్, జోన్-3లో 33వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొందాడు.

75వ ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్‌గా..


అనూష

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లికి చెందిన మంద అనూషది నిరుపేద కుటుంబం. ఆమె డీఎస్సీలో 75వ ర్యాంకు సాధించి, స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్)గా ఎంపికై ంది. భూమయ్య–మణెమ్మ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. అనూష రెండో కుమార్తె. ఈమె ఒకటో తరగతి నుంచి ఏడోతరగతి వరకు గాగిరెడ్డిపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదివింది. ఎనిమిదో తరగతి నుంచి పదోతరగతి వరకు ఇందుర్తిలో, ఇంటర్మీడియట్ సాంఘిక సంక్షేమశాఖ ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ ఎల్కతుర్తిలో చదువుకుంది. కరీంనగర్ ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ, ఓ ప్రైవేటు కళాశాలలో ఎమ్మెస్సీ ఫిజిక్స్, హుస్నాబాద్‌లో బీఈడీ పూర్తి చేసింది.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శంకర్‌గంజ్ ప్రాంతంలో గల కిరాణంలో మంగళవారం 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజేశ్ తెలిపారు. పెద్దపల్లి పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ ఉంచిన వ్యాపారి బైరి లక్ష్మణ్ నుంచి బియ్యం స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు.

కరీంనగర్ మేయర్‌పై అట్రాసిటీ కేసు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ యాదగిరి సునీల్‌రావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూ టౌన్ సీఐ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరగా మేయర్ తనను కులం పేరుతో దూషించారని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత కోర్టును ఆశ్రయించారన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అన్నావదినపై దాడి చేసిన వ్యక్తికి జైలు

జగిత్యాలజోన్: సొంత అన్నావదినపై దాడి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రసాద్ మంగళవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం.. బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌కు చెందిన రొండి రవీందర్, మాణిక్యం అలియాస్ సంతోష్ అన్నదమ్ములు. వీరి మధ్య పాత ఇల్లు, ఎకరం భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీనికితోడు తన కుటుంబానికి అన్నావదిన మంత్రాలు చేస్తున్నారని సంతోష్ వారిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో అన్న రవీందర్ తన కుటుంబసభ్యులతో కలిసి ఫిబ్రవరి 21, 2018న ఇంట్లో భోజనం చేస్తున్నాడు. ఆ సమయంలో సంతోష్ కత్తి తీసుకొని, వారి ఇంట్లోకి ప్రవేశించి, అన్నావదినపై దాడి చేశాడు. బాధితులు కేకలు వేయడంతో అక్కడినుంచి పారి పోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రవీందర్, అతని భార్యను చుట్టుపక్కలవారు జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంతోష్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సైలు ఎస్. మధుకర్, కె.రవీందర్ కేసు దర్యాప్తు పూర్తి చేశా రు. నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో చార్జి షీట్ వేశారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి, సంతోష్‌కు శిక్ష ఖరారు చేశారు.

ఆస్తి వివాదం.. వృద్ధుడి ఆత్మహత్యాయత్నం


ఒంటిపై డీజిల్ పోసుకుంటున్న చంద్రయ్య

కొండగట్టు(చొప్పదండి): ఆస్తి వివాదం నేపథ్యంలో ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎస్సై సందీప్ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన నాంపెల్లి రాజేశం, చంద్రయ్య అన్నదమ్ములు. ఇద్దరి మధ్య ఆస్తి వివాదం తలెత్తడంతో కుల పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అయినా, తనకు న్యాయం జరగలేదంటూ చంద్రయ్య మంగళవారం రోడ్డుపైకి వచ్చి, ఒంటిపై డీజిల్ పోసుకున్నాడు. స్థానికులు అడ్డుకొని, అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

వేములవాడ రూరల్: చోరీ కేసులో ఓ వ్యక్తికి 5 నెలల జైలుశిక్ష విధిస్తూ వేములవాడ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి మంగళవారం తీర్పునిచ్చారని వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లికి చెందిన దుర్గం ప్రవీణ్ ద్విచక్రవాహనాన్ని సిద్దిపేట జిల్లా మోచిగల్లికి చెందిన బాణాల గణేశ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో దొంగిలించాడు. బాధితుడు వేములవాడ పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై అంజయ్య దర్యాప్తు పూర్తి చేసి, కోర్టులో చార్జిషీట్ వేశారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేశ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున విక్రాంత్ కేసు వాదించగా.. న్యాయమూర్తి పూర్వాపరాలు పరిశీలించి, గణేశ్‌కు శిక్ష ఖరారు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లికి చెందిన గోలి సదానందం(48) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సదానందం అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య తార, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు

- డ్రోన్ టెక్నాలజీపై కలెక్టర్‌కు వివరించిన రోబోటిక్స్ ప్రతినిధి


కలెక్టర్‌కు వివరిస్తున్న బ్లూబాట్ రోబోటిక్స్

రామగుండం: వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున్నప్పుడే మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని బ్లూబాట్ రోబోటిక్స్ వ్యవస్థాపకుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్షను మంగళవారం ఆయన కలిసి రోబోటిక్స్ పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్ ద్వారా వ్యవసాయంలో రసాయనిక ఎరువుల పిచికారీ విధానంపై వివరించారు. రాబోవు రోజుల్లో వ్యవసాయ కూలీల కొరత, అధిక కూలి తదితర సమస్యలతో రైతులపై ఆర్థికభారం పడుతుందని, వీటిని అధిగమించేందుకు రోబొటిక్ సంస్థ రూపొందించిన డ్రోన్ సాయం తీసుకుంటే తక్కువ ఖర్చు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. అంతేకాకుండా వ్యవసాయ క్షేత్రంలో సంపూర్ణంగా మందులు చల్లే అవకాశం ఉంటుందని చెప్పారు. రాబోవు రోజుల్లో వ్యసాయ సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నట్లు ఆయన వివరించారు. దీనిపై కలెక్టర్ పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, రోబొటిక్ సంస్థ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

నదిలో దూకేందుకు యత్నం.. వ్యక్తిని కాపాడిన పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరినదిలో దూకేందుకు యత్నించిన వ్యక్తిని గోదావరిఖని టూటౌన్ పోలీసులు మంగళవారం కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన స్వామి(50)అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం ఎంతకీ బాగుకాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి గోదావరిఖని సమీపంలోని గోదావరినది వంతెన వద్దకు చేరుకున్నాడు. నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవాడానకి ప్రయత్నించాడు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వామి నదిలో దూకకుండా అడ్డుకొని కాపాడారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నదిలో దూకకుండా కాపాడిన పోలీసులను పలువురు ప్రశంసించారు.

ఓదెలలో ముగిసిన సినిమా చిత్రీకరణ


ఓదెల-2 సినిమా చిత్రీకరణలో సిబ్బంది

ఓదెల(పెద్దపల్లి): దర్శకుడు సంపత్ నంది రూపొందిస్తున్న ఓదెల -2 సినిమా చిత్రీకరణ మూడురోజులపాటు జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పాఠశాల, మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో షూటింగ్ జరిగింది. మంగళవారం జరిగిన షూటింగ్‌తో ఈ ప్రాంతంలో సినిమా చిత్రీకరణ ముగిసినట్లు యూనిట్ ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ హీరోయిన్ తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఓదెల గ్రామానికి చెందిన దర్శకుడు సంపత్ నంది.. ఇప్పటికే ఓదెల సినిమా రూపొందించారు. ప్రస్తుతం ఓదెల-2 నిర్మిస్తున్నారు. మూడు రోజులుగా ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానం, హైస్కూల్, గ్రామంలోని ప్రధాన వీధుల్లో నటీనటులపై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. సినిమా షూటింగ్‌ను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు చేట్టారు.

కొత్త గనులతోనే సింగరేణికి మనుగడ

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

గోదావరిఖని: కొత్తగనుల ఏర్పాటుతోనే సింగరేణి సంస్థకు మనుగడ ఉంటుందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. ఆర్జీ–1 ఏరియా జీడీకే–1 సీహెచ్‌పీలో మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలోని ప్రస్తుత గనుల జీవితకాలం మరో పది, పదిహేనేళ్ల వరకు ఉంటుందన్నారు. కొత్త గనులు తవ్వకుంటే సింగరేణి మనుగడ కష్టమని అన్నారు. కొత్త గనుల కోసం తమ యూనియన్ పోరాటం చేస్తుందని తెలిపారు. దీపావళి బోనస్, లాభాల్లో వాటా, దసరా అడ్వాన్స్, ఇంక్రిమెంట్‌లు, ఇన్సెంటివ్‌లు పొందుతున్నా.. కొత్త గనులు రాకుంటే భవిష్యత్‌లో వీటన్నింటినీ కోల్పోవాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లపాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్, టీబీజీకేఎస్ కార్మికులకు చేసిందేమీ లేదని విమర్శించారు. సంస్థకు రావాల్సిన రూ.29 వేల కోట్లను గత ప్రభుత్వం చెల్లించలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా రూ.4వేల కోట్లు బకాయి పడిందని అన్నారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, ఎస్.వెంకట్‌రెడ్డి, బండి మల్లేశ్, దొంత సాయన్న, మానాల శ్రీనివాస్, కారంపూడి వెంకన్న, బలుసు రవి, నాగేంద్ర కుమార్, బుడిమె సమ్మయ్య, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కేంద్రబృందం పర్యటన


సభ్యులను సన్మానిస్తున్న ఎంపీడీవో శశికళ

పాలకుర్తి(రామగుండం): పుట్నూర్, గుడిపల్లి గ్రామాల్లో కేంద్రబృందంలోని సభ్యులు బాలమురళి, సునీల్ మంగళవారం పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం చేట్టిన పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఈజీఎస్, ఆసరా పింఛన్లు, స్వయం ఉపాధి పథకాల ప్రయోజనాలు పొందుతున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో శశికళ వారిని శాలువాతో సత్కరించారు. ఈజీఎస్, ఐకేపీ ఏపీఎంలు కొమురయ్య, సదానందం, పంచాయతీ కార్యదర్శులు సుమలత, గొర్రె సంతోశ్, కారోబార్ మామిడాల శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ గిరి పాల్గొన్నారు.

SRKM College of B.Sc. Nursing
Vempally, Mancherial
B.Sc. Nursing కన్వీనర్ కోటాలో చేరుటకు KNR UHS Online Application
చివరి తేది: 14-10-2024 వివరాలకు
https:// tsparamed.tsche.in
మేనేజ్‌మెంట్ కోటాలో అడ్మిషన్‌లు జరుగుచున్నవి
హాస్టల్ సౌకర్యం కలదు
అర్హత: NEET/ EAPCET/ INTER BiPC
వివరాలకు సంప్ర: 8374585229, 9866231292



సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు. NPA కూడ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను.అర్చన్‌ఫైనాన్స్,పార్తిబా. 8500236824. [T-283]

పాస్‌పోర్టు పోయినది

■ బి.నర్సయ్య S/o కొమురయ్య, H.NO. 1-49/2, కర్నవాడ, గ్రా॥ వెలిచాల, మం॥ రామడుగు, జిల్లా॥ కరీంనగర్ అను నాయొక్క పాస్‌పోర్టు నెం. HY7066989227724 గలది ఒరిజినల్ పాస్‌పోర్టు పై అడ్రస్ పాత ఇంటి నుండి కొత్త ఇంటికి మారుతుండగా మార్గమధ్యలో పోయినది. కావున ఎవరికైన దొరికినచో పై అడ్రస్‌లో సంప్రదించి ఇవ్వగలరని మనవి. సెల్: 9010308364 [K-1246768]

www.sakshi.com

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185473]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824